E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387


PUBLISHED: HYDERABAD, JANGAON | సంపుటి :01 | సంచిక :43 | మంగళవారం 14 జూలై 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-

## అయోధ్య వివాదాల కేసులో కీలక మలుపు




- కేంద్రం, యూపీకి సుప్రీం నోటీసులు
- ట్రస్ట్‌కు సమాధానం ఇవ్వాలన్న ఆదేశం
- సిట్ స్టేటస్ రిపోర్టు సమర్పించాలి
- నిధుల దుర్వినియోగంపై విచారణ
- జూలై 20కి తదుపరి విచారణ

## తెలంగాణకు సుప్రీంలో ఎదురుదెబ్బ




- పిటిషన్‌లో సాంకేతిక లోపాలు
- స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరణ
- ఏపీకి నోటీసులపై స్పష్టత
- లోపాలు సరిచేయాలని ఆదేశం
- తదుపరి విచారణ వాయిదా

**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నీటి వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై తెలంగాణ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అయితే ఈ విచారణలో తెలంగాణ ప్రభుత్వానికి న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..


## తమిళనాడు ప్రభుత్వానికి ఊరట

- హైకోర్టు ఉత్తర్వులకు సుప్రీం స్టే
- గోవధ కేసులో కీలక మలుపు
- ప్రతివాదులకు నోటీసులు జారీ
- చట్ట నిబంధనలపై ప్రభుత్వ వాదన
- తదుపరి ఉత్తర్వుల వరకు స్టే కొనసాగింపు

2 లో

## ఆరు హత్యల కేసులో కీలక పరిణామం

- నిందితుడు రాజ్‌కుమార్ మృతి
- పాయిజన్ తాగి ఆత్మహత్య?
- పంజర్ల శివారులో మృతదేహం
- 12 బృందాల గాలింపుకు ముగింపు
- రూ.2 లక్షల రివార్డు ప్రకటన




## మమతకు కోర్టు షాక్

- రితబ్రత వర్గానికి ఊరట
- అసలైన టీఎంసీగా గుర్తింపు
- కార్యాలయాలు, నిధులపై హక్కు
- ఈసీకి తీర్పు కాపీ
- టీఎంసీలో కొత్త మలుపు




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్‌లో మాజీ సీఎం మమతా బెనర్జీకి షాక్ తగులగా, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చీలికవర్గానికి న్యాయస్థానంలో గొప్ప ఊరట లభించింది. రెబల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా గుర్తిస్తూ అలీపూర్ కోర్టు తీర్పు చెప్పింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే పార్టీకి సంబంధించిన ఏకైక చట్టబద్ధమైన విభాగమని తీర్పు చెబుతూ.. ఆ వర్గానికే పార్టీ కార్యాలయాలు, నిధులపై నియంత్రణ కల్పిస్తున్నట్టు పేర్కొంది.

తమదే అసలైన పార్టీ విభాగంగా గుర్తిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల రితబ్రత ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## పోలవరం పూర్తిపై సీఎం కీలక వ్యాఖ్యలు

- పుష్కరాలకల్లా పోలవరం పూర్తి
- ధవళేశ్వరం పనులకు శ్రీకారం
- 2021లోనే పూర్తయ్యేదన్న చంద్రబాబు
- సాగునీటికి రూ.24 వేల కోట్లు
- కాటన్ బ్యారేజీ పనుల ప్రారంభం

2 లో




## తెలంగాణలో 7 ఈఎస్ఐసీ ప్రాజెక్టులు

- రూ.668 కోట్ల భారీ ప్రాజెక్టులు
- సనత్‌నగర్ నుంచే ప్రారంభం
- 53 లక్షల మందికి లబ్ధి
- కొత్త ఓపీడీ సేవలు
- కార్మికులకు మెరుగైన వైద్యం
- 33 జిల్లాలకు ఈఎస్ఐ సేవలు
- మాండవీయ చేతుల మీదుగా ప్రారంభం

**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తెలంగాణ వేదికగా దేశవ్యాప్తంగా కార్మిక సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఊతం ఇవ్వనుంది. నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి నుంచి దేశవ్యాప్తంగా రూ.668 కోట్ల వ్యయంతో చేపట్టిన 7 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను జూలై 14న కేంద్ర కార్మిక-ఉపాధి, యువజన వ్యవహారాలు-క్రీడా శాఖల మంత్రి డా.మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 53 లక్షల మంది ఈఎస్ఐ లబ్ధిదారులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి తెలంగాణలోని హైదరాబాద్ సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

మిగతాది 2 లో..

## నామినేటెడ్ పదవులపై తుది కసరత్తు

- మీనాక్షి సమక్షంలో కీలక భేటీ
- పనితీరు ఆధారంగా నియామకాలు
- ఒక్కో పదవికి 10 మంది పోటీ
- చైర్మన్ పోస్టుల కోసం లాబీయింగ్
- రెన్యువల్‌పై త్వరలో నిర్ణయం




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** నామినేటెడ్ పదవుల విషయంలో ఎవరికి రెన్యువల్ చెయ్యాలి? ఎవరిని పక్కన పెట్టాలి? కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలి? అనే అంశంపై పార్టీ, ప్రభుత్వ పెద్దల్లో పెద్ద ఎత్తున చర్చోప చర్చలు జరుగుతున్నాయి. పనితీరు ఆధారంగా నియామకాలు జరపాలని భావిస్తోన్న సీఎం రేవంత్.. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

## టీజీ టెట్ ఫలితాల విడుదల




- 43.94 శాతం మంది అర్హత సాధింపు
- 50,544 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు
- జూలై 21న ప్రత్యేక టెట్ నోటిఫికేషన్

## కాంగ్రెస్‌పై పోరుకు సిద్ధం

- హరీశ్‌రావు పాదయాత్ర ప్రకటన
- బసవేశ్వర నుంచి సంగమేశ్వర వరకు
- ప్రాజెక్టుల నిలిపివేతపై ఆగ్రహం
- ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు
- రాష్ట్ర రాజకీయాల్లో హీట్




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాల్లో మరో ఉత్కంఠభరిత పరిణామానికి తెరలేచింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రాజెక్టుల నిలిపివేతను నిరసిస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సంచలన ప్రకటన చేశారు. త్వరలోనే తాను క్షేత్రస్థాయిలోకి వెళ్లనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా 'బసవేశ్వర నుండి సంగమేశ్వర' వరకు భారీ పాదయాత్ర చేపట్టబోతున్నట్లు హరీశ్ రావు స్పష్టం చేశారు. ఈ యాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను జనాల్లోకి తీసుకెళ్లి ఎండగట్టడమే తన అజెండా అని ఆయన ప్రకటించారు.

ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న తీరుపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## ఇరాన్ హిట్‌లిస్టు!




- 13 మంది నేతలతో ఇరాన్ 'రివేంజ్ లిస్ట్'
- ట్రంప్, నెతన్యాహు పేర్లు జాబితాలో
- పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ ఉద్రిక్తతలు
- అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు
- హార్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- దౌత్య చర్చలు విఫలమయ్యాయని టెహ్రాన్ ఆరోపణ

# తమిళనాడు ప్రభుత్వానికి ఊరట



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తమిళనాడులో గోవధపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన కీలక ఆదేశాలకు సుప్రీంకోర్టు సోమవారం తాత్కాలికంగా స్టే విధించింది. బక్రీద్ పండుగకు ముందు గానీ, ఆ తర్వాత ఏ రోజైనా గానీ రాష్ట్రంలో ఆవులు, దూడలను వధ చేయకుండా చూడాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

రెండు వారాల క్రితం తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమిళనాడు జంతు సంరక్షణ చట్టం – 1958లోని సెక్షన్–4 ప్రకారం అనుమతించిన ప్రత్యేక పరిస్థితుల్ని మినహాయించి.. ఆవుల వధపై సంపూర్ణ నిషేధం విధించడం చట్టానికి విరుద్ధమని ప్రభుత్వం తన పిటిషన్లో పేర్కొంది. ప్రస్తుత చట్టం ప్రకారం 10 సంవత్సరాలు దాటినా లేదా.. వ్యవసాయ పనులకు, సంతానోత్పత్తికి పనికిరాని పశువుల్ని సంబంధిత అధికారుల ధృవీకరణ పత్రంతో వధించేందుకు అనుమతి ఉందని ప్రభుత్వం వాదించింది. ఈ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో సవరణ చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానిస్తూ.. ఆ ఉత్తర్వుల్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు హైకోర్టు ఆదేశాలు అమల్లో ఉండవని స్పష్టం చేసింది.

ఈ వివాదానికి కారణమైన ఉత్తర్వులను మే 27న జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ వి లక్ష్మీనారాయణన్‌లతో కూడిన మద్రాస్ హైకోర్టు ధర్మాసనం జారీ చేసింది. అధీకృత స్లాటర్ హౌస్‌లలో మాత్రమే జంతువుల వధ జరగాలని పేర్కొన్న హైకోర్టు, బక్రీద్ సందర్భంగా మాత్రమే కాకుండా ఇతర ఏ రోజునైనా ఆవులు, దూడలను వధ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వాలని కూడా పేర్కొంది.


# అయోధ్య విరాళాల కేసులో కీలక మలుపు



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై విచారణ జరిపి.. కేంద్రం, యూపీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. నిధుల దుర్వినియోగంపై న్యాయస్థానం పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం కీలక విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపి, రామాలయ నిర్వహణను చూసుకునే 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'కు కూడా తమ సమాధానాన్ని దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ నిధుల దుర్వినియోగంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును కోర్టుకు సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ సిట్ బృందంలో ఎవరెవరు సభ్యులుగా ఉన్నారనే వివరాలను కూడా ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొనాలని ఆదేశిస్తూ.. కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి (జూలై 20, 2026) వాయిదా వేసింది.

# పోలవరం పూర్తిపై సీఎం కీలక వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పోలవరం ప్రాజెక్టు పూర్తిపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. కోనసీమ జిల్లాలో పర్యటించిన ఆయన ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయని, అప్పటికి ముందే పోలవరం పూర్తి చేసి ప్రజలకు అంకితమిస్తామని చెప్పారు. రూ.153 కోట్లతో కాటన్ బ్యారేజీ గేట్ల మరమ్మత్తు పనులు చేశామని తెలిపారు. కాటన్ బ్యారేజీ నిర్మించి 175 ఏళ్లు అయిందని గుర్తు చేశారు. దేశానికి అన్నపూర్ణగా గోదావరి డెల్టా మారడానికి కాటనే కారణమన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండి ఉంటే 2021లోనే పోలవరం పూర్తయ్యేదని చెప్పారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఇచ్చామన్నారు. కృష్ణా నీటిని రాయలసీమకు అందించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

నా హయాంలోనే రెండు పుష్కరాలు

"రైతులకు అన్నదాత సుఖీభవ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన సీఎం చంద్రబాబు.. రూ.24 వేల కోట్లు సాగునీటి కోసం ఖర్చు చేశామని తెలిపారు. "తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మళ్లీ ఏర్పాటు చేశాం. రెండు పుష్కరాలు నా హయాంలోనే జరుగుతున్నాయి. సైబరాబాద్‌ను నేనే అభివృద్ధి చేశా." అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# తెలంగాణకు సుప్రీంలో ఎదురుదెబ్బ

మొదటి పేజీ తరువాయి

ఈ కేసులో మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఏపీ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే (ఇంజెక్షన్ ఉత్తర్వులు) ఇవ్వడంతో పాటు నోటీసులు జారీ చేయాలని అభ్యర్థించారు.

అయితే, తెలంగాణ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం వేలెత్తి చూపింది. పిటిషన్‌లోని ఆ లోపాలను పూర్తిగా సరిదిద్దే వరకు ఎలాంటి క్షేత్రస్థాయి విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. తొలుత ఆ లోపాలను సరిదిద్దిన తర్వాతే విచారణలో మిగతా అంశాలను పరిశీలిస్తామని కోర్టు తేల్చి చెప్పింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించకుండా, ప్రాథమిక లోపాలు ఉన్న స్థితిలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం కానీ, ఇంజెక్షన్ ఉత్తర్వులు ఇవ్వడం కానీ అస్సలు కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ప్రభుత్వంపై అసంతృప్తి.. 'బోడిగుండు'తో నిరసన



**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ఉద్యోగ సంఘాల ఫెడరేషన్ వినూత్న నిరసనకు దిగింది. 'చంద్రన్న బోడిగుండు' పేరుతో ఫెడరేషన్ చైర్మన్ వెంకట్రామిరెడ్డితో పాటు పలువురు నేతలు గుండు చేయించుకుని ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సి ఆర్థిక ప్రయోజనాలను కూడా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని మండిపడ్డారు. పీఆర్సీతో పాటు ఐఆర్, డీఏలు, సరెండర్ లీవ్‌ల చెల్లింపులనూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. ఐఆర్ విషయంలోనూ అన్యాయమే జరిగిందన్నారు. ఉద్యోగులతో పాటు వాలంటీర్లకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ నెరవేర్చే వరకూ తమ పోరాటం కొనసాగుతోందని హెచ్చరించారు.

# నామినేటెడ్ పదవులపై తుది కసరత్తు

మొదటి పేజీ తరువాయి

ఈ నెల 14న పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి హైదరాబాద్‌కు రానున్నారు. 15 లేదా 16 తేదీల్లో నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమై నామినేటెడ్ పదవుల నియామకం పై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఒక్కో పదవికి 10 మంది పోటీ..

ఈ నెల 8న 37 మంది నామినేటెడ్ చైర్మన్ల రెండేళ్ల పదవీకాలం ముగిసింది. ఈ పదవులను దక్కించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు, అసలే పదవులు దక్కని లీడర్లు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పదవి ఉంటే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ సౌకర్యం లభిస్తుంటుంది. మంత్రులు, అధికారుల వద్దకు ఈజీగా వెళ్లే అవకాశం ఉంటుంది. వీటికి తోడు ప్రభుత్వం కల్పించే వెహికల్, గన్‌మెన్ సౌకర్యంతో రాజకీయంగా పరపతి పెరుగుతుంది. రాజకీయాల్లో మరింత ఎత్తుకు ఎదిగేందుకు వెసులుబాటు కలుగుతుంది. అందుకని చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే తపనలో లీడర్లు ఉన్నారు. దీంతో ఒక్కో పదవికి సుమారు 10 మంది వరకు పోటీ పడుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పెద్ద ఎత్తున లాబీయింగ్

చైర్మన్ పదవులను దక్కించుకోవాలని టార్గెట్‌గా పెట్టుకున్న లీడర్లు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. ముందుగా జిల్లాకు చెందిన మంత్రుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ తరువాత జిల్లా ఇన్‌చార్జిల మనస్సు గెలుచుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రెండు చోట్ల లైన్‌క్లియర్ అయిన వెంటనే ప్రభుత్వంలోని కీలక నేతల ఆశీస్సుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీలోని కీలక నేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్దకు వెళ్లి పదవి ఇప్పించాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది.

మరో ఛాన్స్ కోసం..

తాజా మాజీ చైర్మన్లు అందరూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇందులో కొందరికి మాత్రమే రెన్యువల్ చేసే అవకాశం ఉంది. చైర్మన్ హోదాలో సదరు నాయకుడు పనితీరు ఆధారంగా మరోసారి అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. అదే సంస్థకు చైర్మన్ పదవి ఇవ్వాలా? లేక మరో సంస్థ బాధ్యతలు అప్పగించాలా? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కొందరు పాత సంస్థలో మరోసారి పని చేసేందుకు మొగ్గుచూపుతుండగా, మరికొందరు కొత్త సంస్థలో పనిచేసేందుకు చొరవ చూపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

# కాంగ్రెస్‌పై పోరుకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. "ప్రాజెక్టులను ఆపి ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఆ బసవేశ్వరుడు, సంగమేశ్వరుడే తగిన గుణపాఠం చెబుతారు" అని హరీశ్ రావు హెచ్చరించారు.

ప్రజా క్షేత్రంలోనే కాంగ్రెస్ తప్పుల లెక్కింపు..

అధికారంలోకి వచ్చిన నాటి నుండి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, పైగా నడుస్తున్న ప్రాజెక్టులను కూడా పడకేసేలా చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ చేస్తున్న ఈ చారిత్రక తప్పులను, వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకే తాను జనం మధ్యకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాదయాత్ర ద్వారా నిలిచిపోయిన ప్రాజెక్టుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా హరీశ్ రావు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. హరీశ్ రావు పాదయాత్ర ప్రకటనతో ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగింది.

# తెలంగాణలో 7 ఈఎస్ఐసీ ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి

ఇక్కడి రూ.211.13 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన నూతన ఓపీడీ విభాగాన్ని కేంద్ర మంత్రి స్వయంగా ప్రారంభించనుండగా, దేశంలోని మిగిలిన 6 ప్రాజెక్టులను ఇక్కడి నుంచే వర్చువల్ విధానంలో దేశానికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్మిక–ఉపాధి, సూక్ష్మ–చిన్న–మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే కూడా పాల్గొంటారు. దేశ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న నిర్మాణ కార్మికులను ఈ వేదికపై మాండవీయ సత్కరించనున్నారు. అలాగే ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను అందజేస్తారు.

తెలంగాణ కార్మికులకు వరం.. సనత్‌నగర్ కొత్త ఓపీడీ

హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రి ఆవరణలో 43,611.04 చదరపు మీటర్ల భారీ విస్తీర్ణంలో ఈ నూతన ఓపీడీ విభాగాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించారు. ఇందులో జనరల్ మెడిసిన్, ఈఎన్టీ, డెంటల్, గైనకాలజీ, కంటి చికిత్స, ఆర్థోపెడిక్స్, సైకియాట్రీ, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, ఆయుష్ విభాగాల ఓపీడీ సేవలు ఒకే చోట లభిస్తాయి. దీనితో పాటు ఫిజియోథెరపీ, రేడియాలజీ, యోగా కేంద్రం, 180 సాధారణ పడకలు (మూడు 60 పడకల వార్డులు), 25 ఐసీయూ పడకలు, 20 ఎన్ఐసీయూ పడకలు, మందుల దుకాణం, క్లినికల్ లెక్చర్ థియేటర్లను ఏర్పాటు చేశారు.

ఈ కొత్త విభాగం ద్వారా తెలంగాణలోని హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని 12,30,183 మంది బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర వైద్య సేవలు అందనున్నాయి. కాగా... 1975 మార్చి 30న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం జంట నగరాల (హైదరాబాద్, సికింద్రాబాద్) పరిధికే పరిమితమై ప్రారంభమైన ఈ ఈఎస్ఐ ఆస్పత్రి, కాలక్రమేణా సేవలని విస్తరించింది. ప్రస్తుతం ఈఎస్ఐసీ 2.0 సంస్కరణల కింద తెలంగాణలోని మొత్తం 33 జిల్లాలకూ ఈ పథకాన్ని వర్తింపజేశారు. దీని ద్వారా రాష్ట్రంలో సామాజిక భద్రత కింద మొత్తం 19,15,700 మంది బీమా చందాదారులు, 74,32,916 మంది లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి.

దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఇతర ప్రాజెక్టుల వివరాలు

రాజమహేంద్రవరం ఈఎస్ఐఎస్ ఆసుపత్రి (ఆంధ్రప్రదేశ్): ఇక్కడ 26 ఓపీడీ గదులు, 3 ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో కూడిన వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. దీనివల్ల 1,31,190 మంది బీమా చందాదారులతో పాటు మొత్తం 2,52,717 మంది లబ్ధిదారులకు మేలు జరుగుతుంది.

బెల్తోలా ఈఎస్ఐసీ ఆసుపత్రి (అస్సాం): ఇక్కడి ఆసుపత్రిని 200 పడకల సామర్థ్యానికి ఉన్నతీకరించారు. దీని ద్వారా అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలోని 3.42 లక్షల మంది బీమా చందాదారులతో సహా మొత్తం 13.27 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది.

శ్రీపెరంబుదూర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి (తమిళనాడు): ప్రముఖ మ్యానుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారిన శ్రీపెరంబుదూర్‌లో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. ఇక్కడ ఓపీడీ, ఎమర్జెన్సీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ల్యాబ్, ఫార్మసీ సదుపాయాలు ఉంటాయి. దీనివల్ల కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల పరిధిలోని 5.5 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది.

సురేంద్రనగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీ (గుజరాత్): ఇక్కడ ఒకే చోట ప్రాథమిక ఆరోగ్య సేవలు, వైద్య సంప్రదింపులు, మందులు లభిస్తాయి. దీని ద్వారా సుమారు 35,000 మందికి లబ్ధి చేకూరుతుంది.

కోటా ఉద్యోగ నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీ (రాజస్థాన్): ఇక్కడి పారిశ్రామిక ప్రాంత కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా 75,000 మంది బీమా చందాదారులు సహా మొత్తం 2,91,000 మందికి సేవలు అందుతాయి.

భవానీ మండి ఈఎస్ఐ డిస్పెన్సరీ (రాజస్థాన్): ప్రముఖ టెక్స్‌టైల్ హబ్ అయిన ఈ ప్రాంతంలోని పారిశ్రామిక కార్మికుల కోసం ఏర్పాటైన ఈ డిస్పెన్సరీ ద్వారా 27,715 మంది చందాదారులు సహా మొత్తం 1.07 లక్షల మందికి ఆరోగ్య సేవలు అందనున్నాయి.

# ఆరు హత్యల కేసులో కీలక పరిణామం




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడ గ్రామంలో ఒకే రాత్రి ఆరుగురిని కిరాతకంగా నరికి చంపి, రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ కథ విషాదాంతమైంది. గత రెండు రోజులుగా పోలీసుల కళ్లుగప్పి పరారీలో ఉన్న రాజ్‌కుమార్ చివరకు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండల పరిధిలోని పంజర్ల గ్రామ శివారులో అతడి మృతదేహం లభ్యమవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

ఘటనా స్థలంలో పాయిజన్ బాటిల్..

పోలీసుల కథనం ప్రకారం.. పంజర్ల గ్రామ శివారు ప్రాంతంలో ఒక వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని షాబాద్ నరమేధం కేసులో మోస్ట్ వాంటెడ్ నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్‌గా గుర్తించారు. మృతదేహం పక్కనే పాయిజన్ బాటిల్ లభ్యం కావడంతో, పోలీసుల వేట తీవ్రమవ్వడం, ఎటూ తప్పుకుపోయే అవకాశం లేకపోవడంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

మేనమామ ఊరిలో బలవన్మరణం

అయితే, హత్యలు జరిగిన తర్వాత నిందితుడిని పట్టుకునేందుకు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పోలీసులు సుమారు 12 ప్రత్యేక బృందాలతో విస్తృతంగా గాలింపు చేపట్టారు. అంతేకాకుండా అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. పోలీసుల గాలింపు తీవ్రమవడంతో ఎక్కడా ఆశ్రయం దొరకక, చివరకు కొత్తూరు మండలంలోని తన మేనమామ ఊరైన పంజర్లకు రాజ్‌కుమార్ చేరుకున్నాడు. అక్కడే గ్రామ శివారులోకి వెళ్లి విషం తాగి ప్రాణాలు తీసుకున్నాడు. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో కన్నబిడ్డలు, భార్యతో సహా ఆరుగురిని పొట్టనబెట్టుకున్న కిరాతకుడు.. చివరకు ఇలా పాయిజన్ తాగి శవమై తేలడంతో కేసు దాదాపు ముగిసినట్లయింది. ఈ మేరకు పోలీసులు రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# టీజీ టెట్ ఫలితాల విడుదల

**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్–జూన్ 2026) ఫలితాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. జూన్ 16 నుంచి 22 వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో 10 సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,53,752 మంది దరఖాస్తు చేసుకోగా, 1,15,028 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 50,544 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత శాతం 43.94గా నమోదైంది.

పేపర్–1లో ఉత్తీర్ణత శాతం 65.29గా ఉండగా, పేపర్–2 (మ్యాథ్స్ అండ్ సైన్స్)లో 40.76 శాతం, పేపర్–2 (సోషల్ స్టడీస్)లో 25.79 శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టీజీటెట్ నోటిఫికేషన్‌ను జూలై 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఆ పరీక్షలు సెప్టెంబర్ 7 నుంచి 11 వరకు సీబీటీ విధానంలో నిర్వహించబడతాయి. ఇకపై ప్రతి సంవత్సరం మొత్తం నాలుగు టెట్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో రెండు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు, మరో రెండు సాధారణ అభ్యర్థులకు కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఇరాన్ హిట్‌లిస్టు!




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పశ్చిమాసియా లో యుద్ధం ఆగినట్టే కనిపించినా ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పర దాడులతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివేంజ్ లిస్ట్‌ను ప్రచురించింది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి.

ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇటీవల మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని, దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది.

ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది.

అగ్రరాజ్యం చేస్తున్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

# మమతకు కోర్టు షాక్




**న్యూస్ డెస్క్, 13 జూలై (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్‌లో మాజీ సీఎం మమతా బెనర్జీకి షాక్ తగులగా, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చీలికవర్గానికి న్యాయస్థానంలో గొప్ప ఊరట లభించింది. రెబల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా గుర్తిస్తూ అలీపూర్ కోర్టు తీర్పు చెప్పింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే పార్టీకి సంబంధించిన ఏకైక చట్టబద్ధమైన విభాగమని తీర్పు చెబుతూ.. ఆ వర్గానికే పార్టీ కార్యాలయాలు, నిధులపై నియంత్రణ కల్పిస్తున్నట్టు పేర్కొంది.

తమదే అసలైన పార్టీ విభాగంగా గుర్తిస్తూ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల రితబ్రత ఆనందాన్ని వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఉత్తర్వు కాపీ వచ్చిన వెంటనే దానిని ఎన్నికల సంఘానికి పంపుతానని తెలిపారు. ఈ తీర్పు తర్వాత గుర్తింపు పొందిన కమిటీకి తప్ప మరెవరికీ తృణమూల్ కాంగ్రెస్ పేరుతో సంస్థను నడిపే హక్కు లేదని ఆయన ఉద్ఘాటించారు. ఈ తీర్పుతో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు, నిధులపై తమకు పూర్తి నియంత్రణ వస్తుందన్నారు.

# ఎల్లారెడ్డిపల్లిలో మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్లపల్లి

భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సామాజిక విప్లవకారులు మహాత్మా జ్యోతిరావు పూలే,సావిత్రిబాయి పూలే,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులు సమాజంలో సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం తమ జీవితాలను అంకితం చేశారని కొనియాడారు.జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగానే నేడు అనేక విద్యాసంస్థలు కొనసాగుతున్నాయని,విద్య ద్వారానే సమాజంలో విప్లవాత్మక మార్పు సాధ్యమని ఆయన ఆనాడే నిరూపించారని పేర్కొన్నారు. అలాగే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం వల్లనే నేడు ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నారని, మన జీవితంలోని ప్రతి అడుగులోనూ రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తున్నామని స్పష్టం చేశారు.భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే మహిళా విద్యా వికాసానికి గొప్ప మార్గదర్శకురాలని ఎమ్మెల్యే కొనియాడారు. అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందించడంతో పాటు, మహిళలు చదువుకోవాలనే గొప్ప లక్ష్యంతో జ్యోతిరావు పూలేతో కలిసి దేశంలోనే తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి ఆమె చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. కేవలం మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా, వారి ఆశయాలను, సిద్ధాంతాలను భావితరాలకు అందిస్తూ వారు చూపిన మార్గంలో నడవడమే వారికి మనం అందించే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక సర్పంచ్, ప్రస్తుత మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల పార్టీ బాధ్యులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొరికిశాల కేజీబీవీని ఆకస్మికంగా సందర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు







తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్లపల్లి

భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని మొగుళ్లపల్లి మండలం కొరికిశాల గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను, వసతులను పరిశీలించి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు.విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజన వసతులు, వారు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ క్రమంలో పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా,ఆయన తక్షణమే స్పందించారు.అక్కడికక్కడే మిషన్ భగీరథ ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, పాఠశాలకు తక్షణమే నిరంతర తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు.అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక విద్యా, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.విద్యార్థినులు వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థినుల ఆరోగ్యం, పాఠశాల పరిశుభ్రత విషయంలో వార్డెన్లు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థినులకు పంపిణీ చేసిన అల్పాహారాన్ని (స్నాక్స్) ఎమ్మెల్యే వారితో కలిసి తిన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మొగుళ్లపల్లి తాహసిల్దార్ (ఎమ్మార్వో), కేజీబీవీ ప్రిన్సిపాల్, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, స్థానిక సర్పంచ్,మండల స్థాయి ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు, పాఠశాల సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు

# విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట:ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

## మొగుళ్లపల్లి గురుకులంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే








తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్లపల్లి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.సోమవారం మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన వసతి గృహంలో విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేసి, మెస్ నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. 1 నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుల్లో రాణించగలరనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు,వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.విద్యార్థులకు మరింత నాణ్యమైన, పోషకాలతో కూడిన భోజనాన్ని అందించేందుకే మెస్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచినట్లు గుర్తుచేశారు.అలాగే భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించేందుకు వీలుగా,భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని దశలవారీగా అన్ని వసతులతో వేగంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ),పాఠశాల ప్రిన్సిపాల్, వివిధ శాఖల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్యలు లేకుండా ఆర్టీసీ విలీన ప్రక్రియ జరగాలి

**ఆర్టీసీ లో ఐక్య పోరాటాల వేదిక ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలపరచండి**

**ఖమ్మం డిపో విస్తృత స్థాయి సమావేశంలో గడ్డం లింగమూర్తి, తుమ్మ విష్ణువర్ధన్ ల పిలుపు.**






తెలుగు గళం న్యూస్ , ఖమ్మం పట్టణం/ జూలై 13, ఖమ్మం జిల్లా : తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ అన్ని సమస్యలు పరిష్కరించుకున్న తర్వాత ఏ విధమైన సమస్యలు లేకుండా జరగాలని, క్షేత్రస్థాయిలో ఆర్టీసీ కార్మికుల సమస్యలను సేకరిస్తూ పరిష్కరించాలంటూ ఆర్టీసీ యాజమాన్యానికి,ప్రభుత్వానికి నివేదికలందిస్తున్న ఆర్టీసీ కార్మికుల ఐక్య పోరాటాల వేదిక ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలపరచడం ద్వారా ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి, సిఐటియు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్ లు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం లోని కొండబోలు వెంకయ్యచౌదరి మీటింగ్ హాల్ లో గడ్డం వెంకటయ్య అధ్యక్షతన ఏర్పాటైన ఖమ్మం డిపో విస్తృత స్థాయి సమావేశంలో గడ్డం లింగమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిపో కమిటీ సహాయ కార్యదర్శి జి.బాబు అతిథులను వేదిక పైకి ఆహ్వానించగా, ఉపాధ్యక్షులు గుర్రం రామారావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రతినిధులు అందరూ మౌనం పాటించి నివాళులర్పించారు.డిపో కార్యదర్శి రోశయ్య కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు.ప్రతినిధులు అందరూ చర్చల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లింగమూర్తి ప్రసంగిస్తూ తెలంగాణ ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని త్వరలోనే ఆర్టీసీలో ఎన్నికల ప్రకటన విలువడనుందని తెలిపారు అందుకని గత కెసిఆర్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసీలో సంఘాల పట్ల ఆంక్షలు విధించినప్పటినుండి అనేక కార్మిక కార్మిక సమస్యల పట్ల ఎస్ డబ్ల్యూ ఎఫ్ గా స్పందించామని కరపత్రాలు పంచటం,డిమాండ్ బ్యాడ్జీలు ధరించడం,సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందించడం,పెన్షన్ స్కీము,ఆర్టీసిలో విద్యుత్ బస్సుల పథకం,ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వంలో విలీనంపై అధ్యయనం వంటి కార్యక్రమాలతో నిత్యం కార్మికులతోనే ఉన్నా మన్నారు.అందువల్ల విలీన ప్రక్రియ సజావుగా జరగాలంటే,ఆర్టీసీ కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు కావాలంటే,సమరశీల పోరాటాల వేదిక ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలోపేతం చేయాలని,అందుకోసం ఎస్ డబ్ల్యూ ఎఫ్ కార్యకర్తలు నిరంతరం ప్రచారంలో ఉండాలని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్ ప్రసంగిస్తూ ఆర్టీసీలో జరిగిన అన్ని సమ్మె పోరాటాల్లో సిఐటియు ఆర్ టి సి కార్మికులకు అండగా నిలిచిందని సిఐటియు అనుబంధం గా ఉన్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కు సిఐటియూ జిల్లా కమిటీ ఎల్లవేళలా సంపూర్ణంగా అండగా ఉంటుందని తెలిపారు. ఖమ్మం రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండు మాధవరావు,పిట్టల సుధాకర్ లు ప్రసంగిస్తూ ఖమ్మం రీజయన్లో స్థానిక గుర్తింపు సంఘం గా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కార్మిక సమస్యల పరిష్కారానికి గుర్తింపును ఆయుధంగా ఉపయోగించిందని తెలిపారు.ఎస్ డబ్ల్యూఎఫ్ గుర్తింపు కాలంలో ఖమ్మం రీజియన్ లో కార్మికుల పని పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయన్నారు.గుర్తింపు సంఘంగా ఉంటూనే టిమ్స్,సింగల్ క్రూ,అద్దె బస్సులు,అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టీకరణ విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించామన్నారు. ఎస్ డబ్ల్యూ ఎఫ్ ను బలోపేతం చేయడం కోసం కార్యకర్తలు అందరూ కంకణ బద్దులు కావాలని పిలుపునిచ్చారు. ఖమ్మం రీజియన్ ప్రచార కార్యదర్శి తోకల బాబు ప్రసంగించిన ఈ కార్యక్రమంలో రీజనల్ ఉపాధ్యక్షులు కుదుదుల వెంకన్న,రీజియన్ సహాయ కారదర్శి వి.రమేష్,కోశాధికారి పగిళ్ళపల్లి నరసింహారావు డిపో కమిటీ ప్రచార కార్యదర్శి చెరుకూరి రామకృష్ణ(ఆర్కే నాయుడు) నాయకులు వి.ఎస్ మారుతి,సూతగాని రాములు,యాకూబ్, వెంకటేష్,రవి,మణి,శాంతకుమారి,జ్యోత,మాధవి.వాణిశ్రీ,జ్యోతి,రాజనాల నాగమల్లేశ్వరరావు,కె ఎస్ రావు మిల్రీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఐకేపీ,విడిపి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆందోళన




తెలుగు గళం న్యూస్,
గార్ల / జూలై 13,
మహబూబాబాద్ జిల్లా : :

సెర్ప్ సంస్థలో గత 25 సంవత్సరాలుగా గ్రామ స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న ఐకేపీ,విడిపి ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా 18 వేల రూపాయల వేతనం ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఐకేపీ వివోఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఐకేపీ వివోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం స్థానిక ఐకెపి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, ఐకేపీ వివోఏ ల సంఘం జిల్లా కార్యదర్శి చింత మౌనిక మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన అనేక కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గత కొన్ని నెలల క్రితం రాష్ట్ర యూనియన్ తో సెర్ప్ సీఈఓ చర్చలు జరిపి కొన్ని స్పష్టమైన హామీలు కూడా ఇచ్చారని కానీ నేటి వరకు అమలు కు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సెర్ప్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న వీరికి 10 లక్షల రూ, ల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని,సెర్ప్ ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం గ్రామ సంఘం నుండి జీతాలు పెంచాలని,ప్రతి గ్రామ సంఘానికి టాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని,ఆదాయం లేని గ్రామ సంఘాలకు 20 లక్షల స్పెషల్ ఫండ్ ఇవ్వాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో, అనిత, చంద్రకల, మనోహర్, రజిని, స్వప్న, ఉమా, లత, అరుణ, కల్పనా, విజయ్ కుమార్, సైదులు, వివో ఏలు ఉన్నారు

# ప్రతి ఓటు విలువైనదే-ప్రత్యేక సవరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: కొండేటి శ్రీధర్


## ఐనవోలు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన నాయకులు



తెలుగు గళం న్యూస్ ఐనవోలు/జూలై 13

హన్మకొండ జిల్లా:ఐనవోలు: ప్రతి ఓటు విలువైనదని,ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు,భారతీయ జనతా పార్టీ వర్ధన్నపేట కన్వీనర్ కొండేటి శ్రీధర్ ఆదేశాల మేరకు ఐనవోలు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా అయినవోలు మండల ప్రత్యేక సవరణ కన్వీనర్ ఆడేపు విక్రమ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర ఓటు సర్వే జరుగుతున్న వేళ గ్రామ గ్రామాన ప్రత్యేక సవరణపై ప్రజల్లో అవగాహన పెరిగిందని,అర్హులైన ఒక్క ఓటరు కూడా తమ ఓటు కోల్పోయే అవకాశం లేదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అయినవోలు మండలంలోని అయినవోలు, కొండపర్తి, ముల్కలగూడెం, ఒంటిమామిడిపల్లి గ్రామ పంచాయతీలలోని ఎన్నికల బూతులలో పర్యటించారు.భారత ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక సవరణ ఏమి కొత్త కార్యక్రమం కాదని పేర్కొన్నారు.ఒకే దేశం-ఒకే ఓటు మాత్రమే ఉండాలని, దేశంలో అక్రమంగా ప్రవేశించిన వారికి మాత్రమే ఓటు పోతుందనే భయం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి బూత్ స్థాయి అధికారులు,గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో ప్రతి ఓటరు కూడా సర్వేలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల శక్తి కేంద్రం బాధ్యులు కోట కిరణ్, దొణికెల వెంకటేష్,గుండెబోయిన వెంకటేష్ గౌడ్, ఆయా గ్రామాల బూత్ స్థాయి అధికారులు, ప్రజలు.పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన కార్యక్రమం



తెలుగు గళం న్యూస్ ఐనవోలు/జూలై 13

హన్మకొండజిల్లా:అయినవోలు మండలంలోని పంతిని, పున్నేల్, అయినవోలు గ్రామాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, ఓటర్లకు ఫారాల వినియోగం,నమోదు ప్రక్రియ, అర్హతలు,సవరణలు మరియు ఓటరు జాబితాలో వివరాల నవీకరణపై మండల తహసీల్దారు విక్రం పూర్తి వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అయినవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్, రఘు, అయినవోలు 170వ బూత్ బూత్ స్థాయి అధికారి తాటికాయల ప్రశాంత్, పున్నేల్ బూత్ స్థాయి అధికారి ఎడ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.అలాగే,ఓటర్ల నుంచి తీసుకున్న సవరణ ఫారాలను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా తిరిగి అందజేయాలని సూచించారు. ఫారాలు నింపడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సంబంధిత బూత్ స్థాయి అధికారులు మరియు బూత్ స్థాయి అధికారులు పూర్తి సహకారం అందించి ఫారాలను సక్రమంగా నింపేందుకు సహాయం చేస్తారని తెలిపారు.ప్రతి అర్హుడైన ఓటరు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన ఫారాలను సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు.

# హసన్‌పర్తిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

## -- నలుగురు అరెస్ట్, నగదు, మొబైళ్లు స్వాధీనం

తెలుగు గళం న్యూస్ హన్మకొండ

హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం, కాకతీయ వింటేజ్ వెనుక ఉన్న బహిరంగ ప్రదేశంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు.ఈ దాడిలో మౌటం రమేష్, శీలం రవి, పెద్దమ్మ రమేష్, పిట్టల సాగర్ అనే నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరంతా హసన్‌పర్తి పరిసర ప్రాంతాలకు చెందినవారని పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి రూ.16,380 నగదు, 4 మొబైల్ ఫోన్లు, అలాగే పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇటువంటి సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# టేకుమట్ల మండలంలో రూ.2.50 కోట్లతో సీసీ రోడ్ల ప్రారంభం

## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి టేకుమట్ల

గ్రామీణ ప్రాంతాల ప్రగతి, పల్లెల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. పల్లెల ప్రగతియే తెలంగాణ రాష్ట్ర పురోగతికి అసలైన పునాది అని ఆయన పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని టేకుమట్ల మండలంలో మహాత్మా



గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన పలు అంతర్గత రహదారులను సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభించారు. మండలంలోని గర్మిళ్లపల్లి, పంగిడిపల్లి, వెంకట్రావుపల్లి ,దుబ్యాల, టేకుమట్ల గ్రామాల్లో కొత్తగా వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే గండ్ర ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ,గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, పశు పోషణ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.నిరుపేదలకు ఆసరాగా నిలిచే ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం సహా అనేక ప్రజా రంజక సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తోందని భరోసా ఇచ్చారు.అంతర్గత రహదారుల ప్రారంభోత్సవం అనంతరం టేకుమట్ల మండలానికి చెందిన 26 మంది అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిధుల నుండి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్వహస్తాలతో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ?1,00,116 చొప్పున భారీ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వారి ఇళ్లలో వెలుగులు నింపుతోందని హర్షం వ్యక్తం చేశారు.నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి ప్రభుత్వ ఫలాలు అందేలా పారదర్శకంగా ముందుకు సాగుతామని పునరుద్ఘాటించారు.ఎంతో ఉత్సాహభరితంగా సాగిన ఈ నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, మండల పరిధిలోని సర్పంచులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లబెల్లి గ్రామంలో వర్షాల కోసం శివాలయంలో వరుణ ఘటాభిషేకం పూజలు



తెలుగు గళం న్యూస్
వర్ధన్నపేట/జూలై 13

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో వర్షాలు కురవాలని కోరుతూ గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో పవిత్రమైన వరుణ ఘటాభిషేకం పూజా కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు మరియు వేద బ్రాహ్మణులు మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివయ్య కృపతో గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని సంకల్పంతో ఈ పూజ నిర్వహించామని తెలిపారు.ఈ పూజా కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ జిల్లా పరిషత్ సభ్యులు మార్గం బిక్షపతి,గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, బొజ్జ కృష్ణమూర్తి, బొమ్మెర శ్రీనివాస్ గౌడ్, పోలసాని రామచంద్రరావు,దుగ్యాల భాస్కరరావు, దుర్గారావు, బొజ్జ నాగయ్య, వెంకటేశ్వర్లు, భద్రయ్య రాజు, గ్రామ ప్రజలు, భక్తులు. పాల్గొన్నారు.

# ఎపెక్స్ మల్టీస్పెషలిటీ హాస్పిటల్ లో అరుదైన ఆపరేషన్ చేసి 800 గ్రాముల కిడ్నీ లో రాయి తొలగింపు





## డాక్టర్ కె .కిషోర్ కుమార్ రెడ్డి, ప్రముఖ యూరాలాజిస్ట్

తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూలై 13, ఖమ్మం జిల్లా : ఖమ్మం నగరం లోని నరసింహ స్వామి టెంపుల్ రోడ్, బాలాజీ నగర్ ఎపెక్స్ మల్టీస్పెషలిటీ హాస్పిటల్ కి వైద్యం కోసం శ్రీ మతి మైలవరపు విజ్జేశ్వరి, వయసు 30 సం,, భర్త మురళి, జీలూగు మిళ్ల గ్రామము జీలూగు మిళ్ల మండలం, ఏలూరి జిల్లా. గురువారం రోజున డాక్టర్ కె .కిషోర్ కుమార్ రెడ్డి ని సంప్రదించగా పరీక్షలు నిర్వహించి, వారికీ అరుదైన కిడ్నీ జబ్బు ఉన్నది అని కిడ్నీలో రాయి కూడా ఉన్నది అని తెలుపగా వారు డాక్టర్ గారి సలహా మేరకు హాస్పిటల్ లో అడ్మిట్ అయినారు.11వ తేదీన వారికీ శస్త్ర చికిత్స(ఆపరేషన్) చేసి కిడ్నీ లో ఉన్న రాయిని (సుమారు 800 గ్రాముల) తీసినారు. వారు గత 8-10 సం,,రాలుగా మందులు వాడుతున్నారు. ఆపరేషన్ సక్సెస్ అయినది. పేషెంట్ రికవరీ అవుతుంది . ఈ కార్యక్రమంలో డాక్టర్ ముకుంద బర్మా (న్యూరాలోజిస్ట్ డాక్టర్ ఆర్. లలిత (గైనాకాలోజిస్ట్ ) డాక్టర్ దినేష్ కుమార్ రెడ్డి (గ్యాస్ట్రో ఎంట్రోలాజిస్ట్ ) డాక్టర్ రాకేష్ (జనరల్ ఫీసిశియన్ ) డాక్టర్ శివ రామ్ రెడ్డి (ఆర్థోపెడిక్ సర్జన్ ), మేనేజర్ కొరిపెల్లి శ్రీనివాస్ మరియు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై సమావేశం ఏర్పాటు చేసిన సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్



తెలుగు గళం న్యూస్
పర్వతగిరి/జూలై 13

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం జమాల్‌పురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ అధ్యక్షతన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఓటరు నమోదు ఫారాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక బూత్ స్థాయి అధికారులు మరియు అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొని ఓటరు నమోదు కార్యక్రమాన్ని సమీక్షించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనిత,బూత్ స్థాయి అధికారి బండి వంశీ,అంగన్వాడీ కార్యకర్త స్వరూప,భైరబోయిన సదయ్య, గోదారి యాకయ్య,దుడ్డు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రత్యేక సవరణ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ప్రతీ ఓటరుకు సంబంధించిన వివరాలు సేకరించి, వెంటనే నమోదు చేయాలని సూచించారు.గడువులోపు గ్రామంలో అర్హత కలిగిన ప్రతీ ఓటు నమోదు అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# త్వరలో 2వ దశ డైరెక్ట్ జాబ్ కేలండర్. సిఎస్ సాయిప్రసాద్.



అమరావతి, జూలై 13 (తెలుగు గళం): రాష్ట్రంలో రెండవ దశ జాబ్ కేలండర్ సన్నద్ధం చేస్తున్నట్లు ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కార్యదర్శులు, శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. భర్తీ చేయాల్సిన పోస్టుల నోటిఫికేషన్, కంప్లీషన్ ఆఫ్ ఇ-హెచ్ఆర్ఎం,లోకల్ కేడర్ ఆర్గనైజేషన్ కు అనుగుణంగా నోటిఫికేషన్,నూతన లోకల్ కేడర్లలో పోస్టుల కేటాయింపు నోటిఫికేషన్,అన్ని కేడర్లలో ప్రాధాన్యత కేటగిరీలకు సంబంధించి సీనియారిటీ జాబితా ప్రిపరేషన్,ఎలాంట్మెంట్ ఆఫ్ పెర్సన్స్,ఓపెనింగ్ ఆఫ్ రోస్టర్స్, ఎపిపిఎస్సి ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీలకు ఇండెంట్స్ పంపడం తదితర అంశాలపై సమీక్షించారు. ఈప్రక్రియను నిర్దిష్ట వ్యవధి ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని కార్యదర్శులు,హెచ్ఓడిలను ఆదేశించారు.అంతేగాక బదిలీలు,పదోన్నతులకు సంబంధించిన అన్ని అంశాల్లో ఉద్యోగులతో పూర్తి స్నేహపూర్వకంగా,మర్యాదపూర్వకంగా వ్యవహరించి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.పెండింగ్లో ఉన్న వివిధ క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన కేసులు 6నెలల వ్యవధిలోపు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్ వద్ద నుంచి పూర్తి వివరాలను సేకరించారు. నిర్దేశిత టైమ్ లైన్ ప్రకారం ఉద్యోగుల కేటాయింపు తదితర చర్యలు పూర్తి చేయాలని ఇందుకు సంబంధించిన జిఓలను వెంటనే జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈసమావేశంలో స్పెషల్ సిఎస్ లు బి.రాజ శేఖర్, కృష్ణ బాబు, జి.జయలక్ష్మి, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వరుస బైక్ దొంగతనాల ముఠా అరెస్ట్

కుత్బుల్లాపూర్,తెలుగు గళం: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సైబరాబాద్ పరిధిలోని పేట్-బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ముఠా సభ్యులు ఒక కారులో తిరుగుతూ రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునేవారు. అక్కడ పార్క్ చేసి ఉన్న బైక్‌లను మాస్టర్ కీలు, కట్టర్ల సహాయంతో క్షణాల్లో దొంగిలించి పరారయ్యేవారు. మైసమ్మగూడలోని అపారెల్ పార్క్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముఠా అనుమానాస్పదంగా కనిపించి దొరికిపోయింది.

పోలీసులు ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులైన బౌరి అశోక్ సింగ్ (19), అయల్పురం రఘుపతి (22), బండి ప్రణీత్ (23)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరిలో ఒక్కొక్కరిపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్లలో మూడు నుండి నాలుగు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. కాగా, ఈ ముఠాలో ఉన్న చైతన్య, సురేష్ అనే మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. పట్టుబడిన నిందితులను విచారించగా తాము ఇప్పటివరకు రెండు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 19 చోరీ కేసుల్లో భాగస్వామ్యులైనట్లు నేరాన్ని అంగీకరించారు.

నిందితుల నుంచి పోలీసులు రూ. లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాలతో పాటు, దొంగతనాలకు ఉపయోగించిన సుజుకి ఎర్టిగా కారు, 3 మొబైల్ ఫోన్లు, 2 స్క్రూ డ్రైవర్లు, 5 ఎలక్ట్రికల్ స్విచ్‌లు, 2 కట్టర్లు మరియు 2 మాస్టర్ కీలను స్వాధీనం చేసుకున్నారు. పేట్-బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా జరుగుతున్న వాహనాల చోరీలపై అదనపు డీసీపీ పురుషోత్తం మార్గదర్శకత్వంలో, మేడ్చల్ ఏసీపీ సిహెచ్. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.



ఈ ముఠాను పట్టుకోవడంలో ప్రత్యేక బృందాలు కీలకమైన సీసీటీవీ ఫుటేజీలను, స్థానిక నిఘా వర్గాల సమాచారాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకున్నాయి. టెక్నాలజీ సాయంతో దొంగల కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తూ పక్కా ప్లాన్‌తో వారిని అదుపులోకి తీసుకున్నారు. తక్కువ సమయంలోనే ఈ భారీ ద్విచక్ర వాహనాల చోరీ ముఠాను ఛేదించి, విలువైన సొత్తును రికవరీ చేసిన పేట్-బషీరాబాద్ పోలీసుల చాకచక్యాన్ని, ప్రతిభను ఉన్నతాధికారులు అభినందించారు. కేసును ఛేదించిన సిబ్బందికి త్వరలోనే ప్రత్యేక పురస్కారాలు అందిస్తామని డీసీపీ ఎన్. కోటి రెడ్డి ప్రకటించారు.

# మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను పరిశీలించిన సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్, సన్‌ప్రీత్ సింగ్



తెలుగు గళం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీ లెఫ్ట్ టర్న్ అండర్‌పాస్‌ను సందర్శించారు. అధికారులు స్థలాన్ని పరిశీలించి, పనులు పూర్తయిన తర్వాత ట్రాఫిక్ సాఫీగా నడిచేలా ఉండేందుకు విలువైన సూచనలు అందించారు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, వాటి కారణంగా ట్రాఫిక్‌పై పడుతున్న ప్రభావాన్ని సమీక్షించి, ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్‌ను సురక్షితంగా, అంతరాయం లేకుండా మళ్లించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డైవర్షన్ అమలుకు ముందు ట్రయల్ రన్ నిర్వహించి, లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు.

నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ పోలీసులు, నిర్మాణ సంస్థలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.ఈ పరిశీలనలో డీసీపీ ట్రాఫిక్-I ఎస్. రవికుమార్, అదనపు డీసీపీ ట్రాఫిక్-I టి. హనుమత్ రావు, ట్రాఫిక్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

# తప్పు చేసిన ఖాకీ పై కన్నెర్ర జేసిన జిల్లా ఎస్పీ

### హత్య కేసు తప్పుదోవ పట్టించిన బుచ్చిరెడ్డిపాలెం సీఐ శ్రీనివాసరావు ను విఆర్ కు పంపడం తో పాటు స్టేషన్ లోని 23 సిబ్బందిని మొత్తం బదిలీచేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల



నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం(తెలుగు గళం):-

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్లో సీఐ మాతంగి శ్రీనివాసరావును విఆర్ కు పంపడంతో పాటు.. స్టేషన్లో ఉన్న మొత్తం 23 మందిని ఎస్పీ అజిత వేజెండ్ల బదిలీ చేశారు. బుచ్చిరెడ్డిపాలెం మండలం వ్యవసాయ అధికారి శ్రీహరి జూన్ 15న మృతి చెందారు. ముందుగా గుండెపోటుగా చిత్రీకరించారు. తర్వాత సొంత బావమరిది ఆస్తి కోసం కుక్కలను చంపే ఇంజక్షన్లు ఎక్కించినట్లు వెలుగులోకి వచ్చింది. మొదట హత్య అని చెప్పినా ఆ కోణంలో దర్యాప్తు చేయకపోవడం, కేసును పక్కదోవ పట్టించారనే ఆరోపణలతో పీఎస్ సిబ్బందిపై వేటు పడింది.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.